


# అమరబిక్షలు

కె.కె. రఘునందన

దశరథరామయ్యగారు చనిపోయి యేడాది గడిచినా సరే వర్ధనమ్మలో జ్ఞాపకాలు మాత్రం – ఆమెని వదలిపోలేదు. నుదుటిమీది బొట్టు చెరిగిపోయిన దౌర్భాగ్యానికి లోకంలో తలెత్తుకు తిరగలేని పరిస్థితి అయిపోయింది.

కాలం కొవ్వొత్తిలా కరిగిపోతూందే తప్ప పాత రోజులు తిరిగి రావుకదా ! అన్న నిస్పృహ ఆమెను కదిల్చివేసి కన్నీటిని బహిర్గతం చేస్తోంది.

ఒకప్పుడు వర్ధనమ్మ జీవితం సుడిగుండాల్లేకుండా సాగిపోయే నావలా సాగిపోయేది. ఏ ఆటంకాలు లేకుండా సాఫీగా – సంతోషంగా ఇద్దరు కొడుకులతో – ముగ్గురు ఆడపిల్లలతో – పుచ్చ పువ్వులా సంసారం వెల్లివిరిసేది.

కాని ! ఇప్పుడామెలో మిగిలినవి – నైరాశ్యం – చీకటి – నిస్పృహ – నిర్లిప్తత.

పెద్దకొడుకు రాజేషు ఇంజనీర్ ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ముగ్గురు కూతుళ్ళు – మూడుముళ్ళు పడటం వల్ల – అత్తవారిళ్ళకు వెళ్ళిపోయారు. ఎన్నాళ్ళని దగ్గరుండి ఓదారుస్తారు ?

ఎటొచ్చీ రెండో కొడుకు రమేషు ఉన్న ఊర్లోనే ఉద్యోగం కావటంలో తల్లివద్దే ఉండవలసి వచ్చింది. అప్పుడప్పుడు రెండో కోడలు రేణుక సూటిపోటి మాటలకు వర్ధనమ్మ గురౌక తప్పలేదు. ఎంతైనా యజమానిలేని ఇల్లు చుక్కానిలేని పడవలా లోటుగ ఉంటుందన్న నగ్నసత్యం ఆమె మనసులో నాటుకుంది.

మనిషిగా బ్రతికినన్నాళ్ళూ స్వర్గ సుఖాల్ని చవిచూసింది. దేనికీ లోటు అన్నది ఎరగదామె. ఒకర్ని చెయ్యి చాచటం, అప్పు అడగటం ఆమెకు మనుగడలో తెలీని మాటలు.

దశరథరామయ్యగారి పలుకుబడివల్ల అంతా సజావుగానే జరిగిపోయేది. కూరగాయలు, పప్పు దినుసులు - అన్నీ కొనుక్కోకుండానే – ఏ రెల్లివలస రాజాలో, కుమిలి రెడ్డిలో పంపేవారు. ఆయనకు రాజకీయంగా ఎంతో మాటకారితనం, డబ్బు వుండటం వల్ల గుంభనగా ఏనుగులా దర్జాగా ఉండేవారు.

ఆయన తనకున్నంతలోనే ఎక్కువగా చదివించి, ప్రయోజకుల్ని చేసారు. పెద్దకొడుకుని ఇంజనీరింగు చదివించారు. రమేషుకి బియిడి ట్రైనింగ్ కానిచ్చి, భోగాపురం నాయుడ్ని పట్టుకోని మేస్టారుగా ఉన్న వూళ్ళో ఉద్యోగం వేయించుకున్నారు.

ఆయన మాటకు సాధారణంగా ఎవ్వరూ ఎదురు చెప్పేవారు కాదు. వర్ధనమ్మ ఆయనకు ప్రాణం ఇవ్వడానికి సైతం సిద్ధపడేది.

అటువంటిది రెండేళ్ళక్రితం – సుఖసంతోషాలు విరబూసిన ఆ ఇంట్లో – ఏ మాంత్రికుడో చేతబడి చేసినట్లు ఒక్కసారిగా విషబిందువులు చింది – విషాదనాదాలు ధ్వనించాయి.

దశరథరామయ్యగార్కి టి. బి. వచ్చింది. ఆయన రాయిలాంటి శరీరం ఆ ఒక్క జబ్బుకి లొంగిపోవలసి వచ్చింది. అందుకే అంటారు – దేనికి లొంగని మనిషైనా జబ్బుకి లొంగక తప్పదని.

విధి ఈ విధంగా వక్రిస్తుందని ఊహించని వర్ధనమ్మ ఎంతగానో రోదించింది. ఆమెను ఊరడించి – రాజేషు – తండ్రిని విశాఖపట్నం టి. బి. హాస్పిటల్లో జాయిన్ చేసాడు.

దశరథరామయ్యగారి దురదృష్టమో – వర్ధనమ్మ నుదుటి కుంకుమ చెరిగిపోవాలని రాసి వుందో కాని – ఆయన జబ్బు ముదిరిందనీ, అది తగ్గేలా లేదని – డాక్టర్లు నిర్ధారించారు. ప్రయత్నించడం – డబ్బు ఖర్చు పెట్టడం కొడుకులుగా తమ కర్తవ్యమని తలంచి ఆయన్ని ఎమెర్జన్సీ వార్డులో ఉంచారు. వర్ధనమ్మని కూడా 'సీతమ్మధార'లో ఓ చిన్న బస ఏర్పాటుచేసి ఉంచారు రమేషు - రాజేషు.

ఆమెకు చేదోడు – వాదోడుగా వుంటుందని తన భార్య సుస్మితని ఉంచాలనుకున్నాడు రాజేషు. కాని ఒంటరిగా ఉండి చెయ్యి కాల్చుకుంటాడని వూహించిన వర్ధనమ్మ అందుకు ససేమిరా ఒప్పుకోక- ఒంటరిగానే ఉంటానంది.

దానికి రమేషు ఉదాసీనం వహించాక తన భార్య రేణుకను ఆమెతో వుంచి – ఇల్లు తను చూసుకుంటానని చెప్పాడు రాజేషులా కాకుండా

